క్లుప్తంగా

ఆరోగ్యంపై గర్భిణులకు అవగాహన



పోతయ్యవలసలో బాలింతకు అవగాహన కల్పిస్తున్న వైద్య సిబ్బంది

లావేరు: గర్భిణులు, బాలింతలు ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని వైఎస్సార్ విలేజ్ హెల్త్ క్లినిక్‌లు ఎంఎల్‌హెచ్‌పీలు, సచివాలయాల ఏఎస్‌ఎంలు సూచించారు. మండలంలోని 23 సచివాలయాల పరిధిలని గ్రామాల్లో బుధవారం అవగాహన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా గర్భిణులు, బాలింతలు, పిల్లలకు వ్యాక్సినేషన్ చేశారు. ఎటువంటి అనారోగ్య సమస్యలు వచ్చినా వెంటనే వైద్య సిబ్బందిని సంప్రదించాలన్నారు. అంగన్‌వాడీ, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

జాడలో వైద్య సేవలు



వైద్య సేవలు అందిస్తున్న సిబ్బంది

జి.సిగడాం: జాడ గ్రామంలో బాతువ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో బుధవారం వైద్య శిబిరాన్ని నిర్వహించారు. వైద్యాధికారిణి అనుషా రోగులను పరీక్షించి మందులను అందజేశారు. వస్తున్నది వేసవి కాలం నేపథ్యంలో ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలని ప్రజలకు అవగాహన కల్పించారు. ఈవో లక్ష్మణరావు, అప్పలరామయ్య, ఎంఎల్‌హెచ్‌పీ కావ్య, ఏఎస్‌ఎం జి.ప్రమీల, అంగన్‌వాడీ కార్యకర్తలు పోతిరెడ్డి సంధ్య, ముద్దాడ రౌతమ్మ, కేతరాజు రాజ్యలక్ష్మి, ఆశ కార్యకర్తలు ఎం.గీత, జె.నాగమ్మ పాల్గొన్నారు.

నూకాలమ్మతల్లి ఆలయ వార్షికోత్సవం రేపు

శ్రీకాకుళం కల్చరల్: స్థానిక కలెక్టరేట్ రోడ్డులో ఉన్న నూకాలమ్మతల్లి ఆలయ తృతీయ వార్షికోత్సవం ఈ నెల పదో తేదీన జరగనుంది. ఈ విషయాన్ని నక్కవీధి, దేశెల్లెవీధి, కుందనపు వీధి కమిటీ నిర్వాహకులు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా అమ్మవారికి క్షీరాభిషేకాలు, విశేష అలంకరణ సేవ, కుంకుమ పూజలు, లలితా సహస్రనామ పారాయణలు ఉంటాయన్నారు. ఆ రోజు మధ్యాహ్నం అన్నప్రసాద వితరణ ఉంటుందన్నారు.


క్రీస్తు బోధనలు అనుసరణీయం



మాట్లాడుతున్న కరుణాకరరావు

శ్రీకాకుళం కల్చరల్: ఏసుక్రీస్తు బోధనలు అందరికీ అనుసరణీయమని పాస్టర్ చల్లా కరుణాకరరావు అన్నారు. స్థానిక బాపూజీ కళామందిర్‌లో ఏసయ్య ఆరోవ విమోచన పండుగలు బుధవారం జరిగాయి. పీస్ అండ్ రిజాయిస్ గాస్పెల్ మినిస్ట్రీస్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో విశాఖకు చెందిన పాస్టర్ ఎస్‌బీ వరప్రసాద్ దేవుని వాక్యోపదేశం చేయగా.. క్వయిర్ బృందం భక్తి గీతాలను ఆలపించారు. కార్యక్రమంలో కె.సూర్యనారాయణ, ఎస్తేరు రాణి, విజయబాబు, కొర్నేలి, జి.సైమన్, ఆర్.పాలు పాల్గొన్నారు.

షిర్డీసాయి విగ్రహ ప్రతిష్ట



పూజలు నిర్వహిస్తున్న అర్చక బృందం

శ్రీకాకుళం కల్చరల్: అరసవల్లి సూర్యనారాయణ స్వామి దేవాలయం వద్ద నూతనంగా షిర్డీసాయి విగ్రహం ఏర్పాటు చేస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ సందర్భంగా అర్చకులు ధర్మపురి గౌరీశంకరశాస్త్రి ఆధ్వర్యంలో బుధవారం ప్రతిష్ఠ కార్యక్రమాలు, హోమాలు, స్వామివారి విగ్రహం ఊరేగింపు జరిగాయి. కార్యక్రమంలో ప్రతినిధి కె.వి.ఎస్.మూర్తి తదితరులు పాల్గొన్నారు.

న్యాయవాది కుటుంబానికి ఆర్థిక సాయం



సాయాన్ని అందజేస్తున్న దృశ్యం

శ్రీకాకుళం పాతబస్టాండ్: శ్రీకాకుళం జిల్లా బార్ అసోసియేషన్ పరిధిలో న్యాయవాదిగా సేవలందిస్తూ కింతలి చంద్రశేఖర్ (చందు) అనారోగ్యంతో ఇటీవల మరణించారు. ఇతని కుటుంబానికి బార్ అసోసియేషన్ తరఫున రూ.10 వేలును చందు భార్యకు బుధవారం అందజేశారు. కార్యక్రమంలో బార్ అధ్యక్షుడు బెజ్జిపురం ఫాల్గుణరావు, కార్యదర్శి ఎ.భూవనేశ్వరరావు ఉన్నారు.

ఆశల పూత



నదిమివలసలో పూతతో కళకళలాడుతున్న జీడితోట (ఇన్‌సెట్లో) బాతువలో విరబూసిన మామిడి చెట్టు



నాగులవలస మామిడిచెట్లకు మందులను పిచికారీ చేస్తున్న రైతులు

మామిడి, జీడి పంట ఈ ఏడాది కలిసి వస్తోందని రైతులు ఆశిస్తున్నారు. చెట్లకు పూత బాగా రావడమే దీనికి కారణం. జి.సిగడాం మండలంలోని పున్నాం, ఎందువ, బాతువ, ఉల్లివలస, డి.ఆర్.వలస, నదిమివలస, ఎస్‌పీఆర్‌పురం తదితర గ్రామాల్లో మూడు వేల ఎకరాలకుపైగా జీడి, మామిడి తోటలు ఉన్నాయి. ఈసారి విస్తారంగా పూత వచ్చింది. పూత పిందెగా మారి..పంట చేతికి వస్తే నాలుగు కాసులు కళ్ల చూస్తామని రైతులు ఆశిస్తున్నారు. పూతను కాపాడుకోవడానికి సస్యరక్షణ చర్యల్లో నిమగ్నమయ్యారు. అయితే ఇటీవల కురుస్తున్న పొగమంచు రైతులను కలవరానికి గురిచేస్తోంది. దట్టంగా కురుస్తున్న మంచుతో పూతరాలిపోయే ప్రమాదం ఉందని ఆందోళన చెందుతున్నారు. ఉద్యానవనశాఖ అధికారులు సకాలంలో స్పందించి పూతను పరిరక్షించేందుకు తగిన సూచనలు, సలహాలు ఇవ్వాలని కోరుతున్నారు.

-జి.సిగడాం

సంక్షేమ పథకాలతో ప్రజల్లో సంతోషం

- ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్
- సంచాంలో 'గడప గడపకు మన ప్రభుత్వం'



మహిళకు సంక్షేమాన్ని వివరిస్తున్న ఎమ్మెల్యే కిరణ్‌కుమార్

రణస్థలం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అందజేస్తున్న సంక్షేమ పథకాలతో ప్రజల కళ్లల్లో సంతోషం కనిపిస్తోందని ఎచ్చెర్ల ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ అన్నారు. సంచాం గ్రామ సచివాలయ పరిధిలోని గ్రామాల్లో 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమాన్ని బుధవారం చేపట్టారు. ఈ సందర్భంగా 242 ఇళ్లకు వెళ్లి లబ్ధిదారులతో మాట్లాడారు. వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తరువాత చేకూరిన సంక్షేమ పథకాల లబ్ధి వివరాలను వివరించి అందుకు సంబంధించిన బుక్‌లెట్‌ను అందజేశారు. సీఎం జగన్ హయాంలో సంక్షేమ పథకాలన్నీ గ్రామ సచివాలయాలు, వలంటీర్ల ద్వారా నేరుగా అందుతున్నాయా..లేదా అని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా పలువురు స్థానిక సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. విద్యుత్ స్తంభాలు, లైన్లు మార్చాలని, వీధి కాలువలు నిర్మించాలని కోరారు. దీనికి ఆయన స్పందిస్తూ వీలైనంత త్వరగా సమస్యలు పూర్తి చేస్తామని గ్రామస్తులకు హామీ ఇచ్చారు. ప్రజల సంక్షేమం కోసం నిరంతరం పని చేస్తున్న ముఖ్యమంత్రి జగన్‌కు అండగా నిలవాలని కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి పిన్నింటి సాయికుమార్, వైస్ ఎంపీపీ రాయిపురెడ్డి భుజంగరావు, మండల నాయకులు మైలపల్లి కామరాజు, లంకలపల్లి ప్రసాద్, గొర్లె అప్పలనర్సు నాయుడు, చినరామినాయుడు, సంచాం సర్పంచ్ రెడ్డి సూర్యకాంతం, రెడ్డి రాము, రెడ్డి రామకృష్ణ నాయుడు, పతివాడ అప్పలనాయుడు, రెడ్డి ఆనంద్, మీసాల దాలినాయుడు, రాము, రెడ్డి సూరప్పనాయుడు, పప్పల వెంకినాయుడు పలువురు సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

బెజ్జిపురంలో 17 నుంచి శివరాత్రి మహోత్సవాలు



శివరాత్రి మహోత్సవాల వాల్‌పోస్టర్ ఆవిష్కరిస్తున్న దృశ్యం

లావేరు: బెజ్జిపురం గ్రామంలోని ఉమారామలింగేశ్వర పంచాయతన దేవస్థానంలో ఈ నెల 17 నుంచి 19వ తేదీ వరకూ శివరాత్రి మహోత్సవాలను వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని ప్రధాన అర్చకులు ఆరవెల్లి సురేష్ కుమార్, కమిటీ సభ్యులు తెలిపారు. ఉత్సవ వాల్ పోస్టర్లను బుధవారం ఆవిష్కరించారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ.. మహోత్సవాల సందర్భంగా మూడు రోజుల పాటు అభిషేక, ప్రత్యేక పూజలు ఉంటాయన్నారు. సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశామని చెప్పారు. 19వ తేదీన భారీ అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. అలాగే ఈనెల పదో తేదీన దేవస్థానం ఆరో వార్షికోత్సవాన్ని జరుపుతామన్నారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు ఇజ్జాడ శ్రీనివాసరావు, అప్పారావు, వడ్డిపల్లి శ్రీనివాసరావు, దన్నాన శ్రీనివాసరావు, కలిశెట్టి ధర్మారావు, ఇజ్జాడ సన్యాసినాయుడు, పిన్నింటి సూర్యనారాయణ, పిన్నింటి సురేష్, బలివాడ శ్రీను పాల్గొన్నారు.

విశ్వనాథ్, వాణిజయరామ్‌కు నివాళి



మాట్లాడుతున్న ప్రసాద్

శ్రీకాకుళం అర్బన్: తెలుగు సినీరంగంలో కళాతపస్వి కె.విశ్వనాథ్, గాయని వాణీజయరామ్ ఆదర్శంగా నిలుస్తారని సంఘసేవకులు, లయన్స్ క్లబ్ శ్రీకాకుళం అధ్యక్షుడు కె.ఎన్.ఎస్.వి.(హారిక) ప్రసాద్ అన్నారు. శ్రీకాకుళం వర్ధమాన గాయకుల ఆధ్వర్యంలో శ్రీకాకుళంలోని ఓ హోటల్‌లో బుధవారం సాయంత్రం నిర్వహించిన కార్యక్రమంలో కె.విశ్వనాథ్, వాణిజయరామ్‌లకు పలువురు నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారి జీవిత విశేషాలను వక్తలు గుర్తు చేసుకున్నారు. ఈ సందర్భంగా విశ్వనాథ్ చిత్రాల్లోని పాటలు, వాణీ జయరాం ఆలపించిన సినీ గీతాలను కళాకారులు ఆలపించారు. కార్యక్రమంలో వ్యాఖ్యాత వావిలపల్లి జగన్నాథనాయుడు, స్వీప్ అధినేత కొమ్ము రమణమూర్తి, పాలిశెట్టి మధుబాబు, ఎస్.మోహన్, రౌతు శ్రీనివాస రావు, జేసీస్ ప్రతినిధులు పాల్గొన్నారు.

స్పీకర్ తమ్మినేనికి శుభాకాంక్షలు



స్పీకర్ తమ్మినేని సీతారాంకు శుభాకాంక్షలు తెలియజేస్తున్న డాక్టర్ దానేటి శ్రీధర్

ఆమదాలవలస: శాసనసభ స్పీకర్ తమ్మినేని సీతారాం జన్మదినోత్సవం సందర్భంగా ఆయనకు ప్రముఖులు, నాయకులు, అభిమానులు బుధవారం ఆమదాలవలస వెళ్లి శుభాకాంక్షలు తెలియజేశారు.

ఆత్మహత్య పిరికిపంద చర్య

- ప్రిన్సిపాల్ ఎం.రేవతి



విజేతలకు బహుమతులు అందజేస్తున్న ప్రిన్సిపాల్ రేవతి, గ్రంథాలయాధికారి శ్రీనివాసరావు

లావేరు: ఆత్మహత్యకు పాల్పడడం పిరికిపంద చర్యని లావేరు ప్రభుత్వ జూనియర్ కాలేజీ ప్రిన్సిపాల్ ఎం.రేవతి అన్నారు. బలవన్మరణానికి పాల్పడాలనుకునేవారు ముందు తమ కుటుంబ సభ్యుల కోసం ఆలోచన చేయాలన్నారు. మండల కేంద్రంలోని శాఖాగ్రంథాలయం 37వ వార్షికోత్సవం సందర్భంగా ప్రభుత్వ జూనియర్ కాలేజీలో ఆత్మహత్యల నివారణపై బుధవారం అవగాహన సదస్సు నిర్వహించారు. అలాగే విద్యార్థులకు వక్తృత్వ పోటీలు నిర్వహించి గెలుపొందిన వారికి గ్రంథాలయం తరఫున బహుమతులు అందజేశారు. అనంతరం ప్రిన్సిపాల్ మాట్లాడుతూ.. పరీక్షల్లో తప్పామని, కుటుంబ సమస్యలు, ప్రేమ విఫలమైందని, భర్త వేధింపులు భరించలేక తదితర కారణాలతో చాలా మంది బలవన్మరణానికి పాల్పడుతున్నారన్నారు. ఆత్మహత్య చేసుకునే ముందు వారిని నమ్ముకొని ఉన్న కుటుంబ సభ్యులు కోసం ఒకసారి ఆలోచన చేయాలన్నారు. ఏసమస్య వచ్చినా ధైర్యంగా ఎదుర్కోవాలే తప్ప చచ్చిపోవాలనే ఆలోచన చేయరాదన్నారు. విద్యార్థులు లక్ష్యాన్ని ఏర్పాటు చేసుకొని చదివితే మంచిస్థాయికి ఎదుగుతారన్నారు. కార్యక్రమంలో గ్రంథాలయాధికారి మురపాక శ్రీనివాసరావు, లెక్చరర్లు రోహిణి, భవానీ, శోభారాణి, శివకుమార్, సన్యాసిరావు, ఈశ్వరరావు పాల్గొన్నారు.

ఆదిత్యున్ని దర్శించుకున్న ఎమ్మెల్యే కళావతి



కళావతికి జ్ఞాపిక అందజేస్తున్న దృశ్యం

అరసవల్లి: అరసవల్లి సూర్యనారాయణ స్వామి వారిని పాలకొండ ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి బుధవారం సాయంత్రం దర్శించుకున్నారు. ఈమెకు ఆలయ అధికారులు, అర్చకులు గౌరవ స్వాగతం పలికి అంతరాలయంలో ప్రత్యేక పూజలు చేయించారు. అనంతరం ఆదిత్యుని జ్ఞాపికను ఆమెకు అందజేశారు. కార్యక్రమంలో అర్చకులు ఇప్పిలి క్షేమేంద్ర శర్మ పాల్గొన్నారు.


ఇన్ఫోసిస్‌కు కాకినాడ ఆదిత్య విద్యార్థుల ఎంపిక



ఇన్ఫోసిస్‌కు ఎంపికైన విద్యార్థినులు

శ్రీకాకుళం /శ్రీకాకుళం న్యూకాలనీ: మల్టీనేషనల్ కంపెనీ ఇన్ఫోసిస్ నిర్వహించిన క్యాంపస్ ఇంటర్వ్యూల్లో కాకినాడ ఆదిత్య డిగ్రీ కళాశాలల విద్యార్థులు 198 మంది ఎంపికై ప్రభంజనం సృష్టించారని కళాశాల డైరెక్టర్ బీఎస్ చక్రవర్తి తెలిపారు. బెంగళూరుకు చెందిన ఇన్ఫోసిస్ బీపీఎం నిర్వహించిన క్యాంపస్ డ్రైవ్‌లో శ్రీకాకుళం నగరంలోని ఆర్ట్స్ కాలేజ్ రోడ్‌లో ఉన్న కాకినాడ శ్రీ ఆదిత్య డిగ్రీ కో–ఎడ్యుకేషన్ కళాశాల నుంచి 108 మంది, అలాగే నగరంలోని ఎల్ఐసీ కార్యాలయం పక్కన ఉన్న కాకినాడ ఆదిత్య మహిళా కళాశాలలో డిగ్రీ కళాశాల నుంచి 90 మంది ఎంపికైనట్లు వివరించారు. వీరంతా డిగ్రీ ఫైనలియర్ చదువుతున్న విద్యార్థులేనని చెప్పారు. ప్రత్యేక తర్ఫీదు ఇవ్వడం వల్లే సాధ్యమైదన్నారు. సంస్థల అధినేత డాక్టర్ ఎన్.శేషారెడ్డి, సెక్రటరీ డాక్టర్ ఎన్.సుగుణారెడ్డి, డాక్టర్ బీఈవీఎల్ నాయుడు తదితరులు విద్యార్థులను బుధవారం అభినందించారు.

భక్తితో గణపతి హోమం



హోమం నిర్వహిస్తున్న రుత్వికులు

శ్రీకాకుళం కల్చరల్: పాత శ్రీకాకుళంలోని ధర్మశాస్తా ఆలయంలో సంకష్టహరి చతుర్థి సందర్భంగా గణపతి హోమాన్ని బుధవారం నిర్వహించారు. ముందుగా అయ్యప్పస్వామి అభిషేకాలు, అలంకరణ చేశారు. అనంతరం మూలమంత్ర సహిత గణపతి హోమాన్ని, పూర్ణాహుతిని రుత్విక్కులు చేపట్టగా ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలి



రిలే నిరాహారదీక్షలో ఉద్యోగులు

శ్రీకాకుళం అర్బన్: ఆర్టీసీ శ్రీకాకుళం రెండో డిపోలో నెలకున్న సమస్యలను పరిష్కరించాలని ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా కార్యదర్శి కె.దశరథ కోరారు. యాజమాన్యం స్పందించకపోతే ఆందోళనను ఉద్ధృతం చేస్తామన్నారు. సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఐదో రోజైన బుధవారం కాంప్లెక్స్ ఆవరణలో జేఏసీ ఆధ్వర్యంలో ఉద్యోగులు రిలే నిరాహారదీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దీక్ష చేపడుతున్నప్పటికీ యాజమాన్యం కనీసం స్పందించకపోవడం శోచనీయమన్నారు. రాష్ట్రంలో ఎక్కడాలేని విధంగా 13 గంటలు పని విధానం అమలు చేయడం అన్యాయమన్నారు. దీక్షలో జేఏసీ ప్రతినిధులు వి.తాతారావు, జె.ఉషారాణి, కె.ఎస్.రావు, కె.నాగేశ్వరరావు, పి.కపిలేశ్వరరావు, లోపింటి దాలయ్య పాల్గొన్నారు.

సచివాలయాల్లో ఆధార్ సేవలు



రణస్థలం: రావాడలో ఆధార్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న ధనుంజయరావు



జి.సిగడాం: విద్యార్థిని ఐరిష్ సేకరిస్తున్న దృశ్యం

రణస్థలం: మండలంలోని అన్ని గ్రామ సచివాలయాల్లో ఆధార్ సేవలు ప్రారంభించామని ఎంపీడీవో వి.ధనుంజయరావు తెలిపారు. రావాడ, లంకపేట సచివాలయంలో ప్రత్యేక ఆధార్ మొబైల్ డ్రైవ్‌ను బుధవారం పరిశీలించారు. ఐదేళ్లు దాటిన చిన్నారులు తప్పని సరిగా వేలిముద్రలను అప్‌డేట్ చేయించుకోవాలని సూచించారు. పారదర్శకంగా ఆధార్ నమోదు జరగాలని, సరిన్న ధ్రువపత్రాలు లేకపోతే వయస్సు చేర్పులు, మార్పులు చేయరాదని ఆదేశించారు. ప్రత్యేక ఆధార్ సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో లంకపేట కేజీబీవీ ప్రిన్సిపాల్ హైమావతి, గ్రామ సచివాలయ సిబ్బంది ఉన్నారు.

ఆదర్శ పాఠశాలలో ఆధార్ సేవలు

జి.సిగడాం: స్థానిక ఆదర్శ పాఠశాలలో చదువుతున్న విద్యార్థుల కోసం ఆధార్ సేవలను బుధవారం చేపట్టారు. ఆధార్ కార్డులో తప్పులున్న విద్యార్థులకు సంబంధించి మార్పులు, చేర్పులను సిబ్బంది సరి చేశారు. డిజిటల్ అసిస్టెంట్ పాగిరి రాము, సచివాలయం సిబ్బంది, వలంటీర్లు ఉన్నారు .

ఎరువుల దుకాణాల్లో తనిఖీలు



కమ్మసిగడాంలోని ఎరువుల దుకాణంలో తనిఖీ చేస్తున్న రజని

రణస్థలం: ఎరువుల దుకాణాదారులు బిల్లు పుస్తకాలు సక్రమంగా నిర్వహించాలని శ్రీకాకుళం ఏడీఏ బి.రజిని ఆదేశించారు. కమ్మసిగడాం, రణస్థలంలో ఉన్న ఎరువులు, పురుగు మందు దుకాణాల్లో బుధవారం తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఎరువుల దుకాణాదారులు విధిగా లైసెన్స్ కలిగి ఉండాలని, స్టాక్ రిజిస్టార్‌లో ఉన్న నిల్వ దుకాణం, గొడాముల్లో ఉన్న లెక్క ప్రకారం సక్రమంగా ఉండాలని, యూరియా, ఎరువుల తూకం సరిగా ఉండాలని చెప్పారు. 'ఓ' ఫారమ్ ఉంటేనే ఎరువుల అమ్మకాలు, కొనుగోలు చేయాలన్నారు. ఆధార్ కార్డు ఉన్న రైతులకే పురుగు మందులు జరపాలని సూచించారు. తనిఖీల్లో రణస్థలం ఏవో డి.విజయభాస్కర్ ఉన్నారు.

స్వర్ణపతక విజేతకు అభినందనలు



సౌమ్యరాణిని అభినందిస్తున్న డిప్యూటీ ఈఓ తిరుమల చైతన్య

శ్రీకాకుళం: కేరళలోని త్రిసూర్‌లో జరిగిన జాతీయ స్థాయి 2వ ఖేలో ఇండియా పోటీల్లో ఉమెన్స్ లీగ్ కమ్ ర్యాంకింగ్ టోర్నమెంట్‌లో జూడో 40 కేజీల విభాగంలో శ్రీకాకుళం నగరానికి చెందిన కడపల సౌమ్యరాణి స్వర్ణ పతకం సాధించింది. ఈమె గుజరాతీపేటలోని అంధవరపు వరహానరసింహం నగర పాలక ఉన్నత పాఠశాల(వరం స్కూల్)లో చదువుతోంది. సౌమ్యరాణిని తల్లిదండ్రులు కడపల కృష్ణవేణి, శంకర్ నారాయణలు, డీఈవో జి.పగడాలమ్మ, నగర కమిషనర్ ఓబులేసు, డిప్యూటీ ఈవో ఎస్.తిరుమల చైతన్య, కోచ్ పి.ఎస్.మణికుమార్, హెచ్‌ఎం పి.ఇందిరామణి, ఉపాధ్యాయులు, ఎస్‌ఎంఎస్ కమిటీ సభ్యులు బుధవారం అభినందించారు.

న్యాయసేవలు అందించండి



మాట్లాడుతున్న డీఎల్‌ఎస్‌ఏ కార్యదర్శి సన్యాసినాయుడు

శ్రీకాకుళం పాతబస్టాండ్: ప్యానల్ న్యాయవాదులుగా ప్రజలకు న్యాయ సేవలు అందించాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి ఆర్.సన్యాసినాయుడు సూచించారు. బుధవారం న్యాయ సేవా సదన్ లో జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ ప్యానల్ న్యాయవాదులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సొంతంగా న్యాయవాదిని నియమించుకునే ఆర్థిక స్తోమత లేనివారికి ప్యానల్ న్యాయవాదులు న్యాయ సేవాధికార సంస్థ ద్వారా ఉచితంగా సేవలు అందించాల్సి ఉందన్నారు. కార్యక్రమంలో న్యాయ సేవాధికార సంస్థ పానెల్ న్యాయవాదులు సత్యభామ, జ్యోతి, సుధారాణి, రేవతి, అంజనికుమార్, దామోదర్ రావు తదితరులు పాల్గొన్నారు.